# అతను తప్ప...

దార్ల తిరుపతిరావు



ఆనందమంతా పోగు పడినట్టుంది అక్కడ. శ్వేతవర్ణదుస్తులతో, వెండిరంగు జుత్తు పోటీపడ్తూ 60–70 ఏళ్ల మధ్య కేరింతలు కొడ్తూ మాట్లాడుతున్న వాళ్లని చూస్తుంటే 'వయసు' సిగ్గుపడుతోంది.

ఇంతలో కెమెరామెన్, యాంకర్ మిగిలిన యూనిట్ సభ్యులు 'వాన్'లో అక్కడి కొచ్చారు.

ఇతర దేశాల టీ.వి. చానళ్లలోని 'విజే'ల్ని అనుకరిస్తూ తెలుగుని హింసిస్తూ, మనసంస్కృతిని పాతేస్తూ తెచ్చి పెట్టుకున్న హుషారు తో–మేకప్‌ని మరోసారి సరిచూసుకొని "అంతా రేడీయేనా" అంది ఆమె చిన్నపిల్లల్ని గదమాయిస్తున్నట్టు. అక్కడున్న 'పెద్దాళ్లంతా' రెడీ అని అరిచారు చిన్నపిల్లలైపోయి.

"ఇప్పుడు మీరంతా రిటైరైనవాళ్లు, ఇంకా కొంతమంది రెండు మూడు నెలల్లో రిటైరయ్యేవాళ్లు, ఇప్పుడు మీ అభిప్రాయాన్ని, మీ భవిష్యత్కార్యక్రమాన్ని చెబితే మేము మా టీ.వి. కార్యక్రమంలో ప్రసారం చేస్తాం" అంది.

చిన్నగా నిట్టూర్చారు వాళ్లు ఏం జ్ఞాపకాలొచ్చాయో ఏమో! "మొదటగా పేరు చెప్పి వయసూ, మీరు భవిష్యత్తులో ఏం చెయ్యబోతారో చెప్పండి" అంటూ మైక్ ముందు పెట్టింది.

"పేరు సుబ్రహ్మణ్యం, 60 సంవత్సరాలు, మూగ జీవుల ప్రేమలో గడుపుతాను".

"వెరీగుడ్ వెరీగుడ్" అని అతని భుజం తట్టింది యాంకర్ అక్కడున్న సుబ్రహ్మణ్యం గారి మనవలూ, మనవరాళ్లకి ఎంతో ఆనంద మనిపించింది– ఆసీన్.

## డా॥ వై. నాయుడమ్మ

అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన చర్మ సాంకేతిక శాస్త్రవేత్త డా॥ వై. నాయుడమ్మ 1922 సెప్టెంబర్ 10 న గుంటూరు జిల్లా యలపర్తిలో జన్మించి, 1985 జూన్ 23 న విమాన ప్రమాదంలో మరణించారు.

లెహై యూనివర్సిటీ (అమెరికా) నుండి లెదర్ కెమిస్ట్రీలో యం.ఎస్., పి.హెచ్.డి. డిగ్రీలు పొందారు. జె.ఎన్.యు. న్యూఢిల్లీకి వైస్ ఛాన్సలర్‌గా, సి.ఎస్.ఐ.ఆర్.కు డైరెక్టర్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర విజ్ఞానరంగ గౌరవ సలహాదారులుగా అనేక పదవులు నిర్వహించారు.

"నా పేరు పి. సూర్యారావు, వయసు 61, ఆధ్యాత్మిక జీవనం గడుపుదామనీ, నా కుటుంబ సభ్యులతో భక్తి సంగీతాలతో భగవన్నామ సంకీర్తన చెయ్యాలనీ"

"నా పేరు రామకృష్ణ, 62, ఆలయాలు సందర్శిస్తూ ఆత్మతృప్తి పొందుతాను, కవిత్వం రాస్తాను, ధ్యానంతో ఆరోగ్య వంతంగా జీవితం గడుపుతాను".

"నాపేరు ప్రకాశరావు, 65, జీవితంలో ఇంతవరకూలేని ప్రశాంతత కోసం తాపత్రయ పడతాను. ఇప్పటికైనా ఈ గుమస్తా జీవితం నుండి బయట పడ్డానికి ప్రయత్నిస్తాను".

"నా పేరు రాజారావు, 63, హుషారుగా నా కూతుళ్ళు, కొడుకులు, మనమలూ, మనుమరాళ్లతో నా పెన్షన్‌తో గొప్పగా గడిపేస్తాను".

"ఆc.... ఏcవిటి సార్, మీరు కూడా నించున్నారేవిటీ, రిటైరైన వాళ్లకే ఇది" అంది అక్కడున్న ఒకాయన్ని చూసి.

"నేనివ్వాళే స్వేచ్ఛాజీవినయ్యాను", అంటూ చేతిలో పూల బొకే చూపించాడాయన.

"అంటే ఈ రోజే రిటైరయ్యారా?" అంటూ జోకులా నవ్వింది.

"మీరు కూడా మీ భవిష్యత్ గురించి చెప్పండి" అంది. కెమెరా అతని కేసి తిరిగింది.

"నా పేరు ప్రభాకరరావు, మొట్టమొదటగా మా ఇంట్లో ఓ గది ఖాళీచేయించి నేను సేకరించిన మొత్తం పుస్తకాలు అన్నీ-అందరూ చదవడానికి వీలుగా పెడతాను. నేను బాగానే చదువుకున్నాను గనుక మన ప్రాంతంలోని ఇరవై దాటిన పదిమందిని తీసుకొచ్చి ఫ్రీగా పాఠాలు చెబుతాను. నా ఎన్సీసీ పరిజ్ఞానాన్ని ఉపయోగించి వాళ్ళు ఆరోగ్యంగా ఉండేటట్టు, నాయకత్వ లక్షణాలు పెంపొందేటట్టు తీర్చిదిద్దుతాను. వాళ్లని ఎనభైశాతం సినిమా వార్త లుండే పిచ్చి టీ.వీ.ఛానళ్లు చూడనివ్వను. పర్యావరణాన్ని పాడుచేసే ఫ్రిజ్‌లు వాడనివ్వను. రోజూ అన్ని వార్తా పత్రికలూ సంపాదకీయాల్తో సహా చదవమంటాను, సైకిల్ వాడమంటాను అవసరాలకి. సాయంకాలాలు వేమన నించి, శ్రీశ్రీ వరకూ చదివిస్తాను. కాలవొడ్డుకి తీసుకెళ్లి 'గుర్రపుడెక్కాకు' తీయిస్తాను, రోడ్డుప్రక్క చెట్లు నాటించి నీళ్లు పోయిస్తాను. సిటీబస్సెక్కించి తీసుకొస్తాను. పెద్దవాళ్లు నించున్నా, వీళ్లు కూర్చుంటే కాలర్ పట్టి లేపుతాను.

'కట్నం తీసుకోకుండా పెళ్లి చేసుకుంటామని' ఫోటోతో సహా పేపర్లో వేయిస్తాను. 'కులం-మతం' తొలగించమని రాష్ట్రపతికి ఉత్తరాలు రాయిస్తాను- అసలైన 'గ్లోబలైజేషన్' కి అర్థం చెప్పిస్తాను. చదువుకున్న ప్రతీ వాడిచేత గంటసేపు-ఇంకొకరికి చదువు చెప్పిస్తాను. సమాజం బాగుపడితే వ్యక్తి బాగుపడతాడని చెప్పిస్తాను. ఆ పదిమంది వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేందుకు అన్ని విధాలా సాయపడతాను. ఓపికున్నంత వరకూ మిమ్మల్ని కూడా ఇలాగే బ్యాచ్‌లుగా బాగు చెయ్యమని కోర్తాను" అని మిగిలిన వారికేసి చూసాడు.. అంతా చప్పట్లు కొట్టారు.

ఆ తర్వాత కూడా కొంతమంది వాళ్ల భవిష్య కార్యక్రమం ఏకరువు పెట్టారు. ప్రోగ్రాం ముగిసింది.

వారం తర్వాత 'ఈ కార్యక్రమం' టీ.వి.లో వచ్చింది.

ముసలాళ్లూ, వారి పడుచువాళ్లూ కూర్చుని చూసారు. అందులో అందరూ ఉన్నారు. ఎటొచ్చీ ప్రభాకరరావు గారు లేరు. కారణం తెలీదు. ★